

రమణీయం.. రథోత్సవం

పెద్దకడబూరు: తారాపురం గ్రామంలో శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం గురువారం రమణీయంగా సాగింది. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.



క్షయ కబళించకుండా..

సమాజం నుంచి క్షయ వ్యాధిని పారదోలాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. జిల్లాలో తొమ్మిది టీజీ యూనిట్లు ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు. 8లో▸



హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు

శ్రీ వల్లెలాంబదేవి తిరుణాలను పురస్కరించుకుని గురువారం కోడుమూరు పట్టణంలో పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 30 వరకు పొట్టేళ్లు వచ్చాయి. 8లో▸



	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:56
ఆదోని	సా॥ 6:38	ఉ॥ 4:59
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:53
ఆత్మకూరు	సా॥ 6:33	ఉ॥ 4:54
బనగానపల్లె	సా॥ 6:36	ఉ॥ 4:54

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు:

పేదలకు విరివిగా దానధర్మాలు చేయండి. పవిత్ర రంజాన్ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే సాధారణ రోజుల్లో డెబ్బయి రూపాయలు చేసినంత పుణ్యం లభిస్తుంది. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

జిల్లాకు 73 వేల సరిహద్దురాళ్లు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జేసీ రామసుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): జిల్లాకు 73 వేల సరిహద్దు రాళ్లు వచ్చాయని, వీటిలో 11,500 రాళ్లను 47 గ్రామాల్లో నాటామని కలెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. రీ సర్వే పనులు వేగంగా జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం విజయవాడ నుంచి రీసర్వేపై భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఏప్రిల్ 30 నాటికి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసే ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను మార్చి 31లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ డ్రోన్ ఫ్లయింగ్ పనులు 472 గ్రామాలకుగాను 166 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. 68 గ్రామాలకు సంబంధించిన ఆర్ఐఆర్‌లు కూడా వచ్చాయన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల దరఖాస్తుకు నేడే ఆఖరు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న 204 వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారమే ఆఖరని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 139 గ్రామ, 65 వార్డు వలంటీర్ల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం వరకు అందిన దరఖాస్తులను 25వ తేదీన పరిశీలిస్తామని, 27న మౌఖిక పరీక్ష, 28న ఎంపికైన వారి వివరాలను తెలియజేస్తామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 30వ తేదీన శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. 31వ తేదీ నుంచి వలంటీర్లు తమ విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సంబంధిత ఎంపీడీఓ/మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

29న పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు

కర్నూలు కల్చరల్: ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి, ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎమ్ఈజీపీ)పై ఔత్సాహిక నిరుద్యోగ యువత, పారిశ్రామిక వేత్తలకు ఈనెల 29వ తేదీన చేనేత జౌళి శాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి ఉప సంచాలకులు హరికృష్ణ తెలిపారు. ఈనెల 23వ తేదీన నిర్వాహించాల్సిన అవగాహన సదస్సును అనివార్య కారణాలతో 29వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ మార్పును గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్‌లో 1,035 మంది విద్యార్థుల గైర్హాజరు

కర్నూలు కల్చరల్: జిల్లా వ్యాప్తంగా 124 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో గురువారం జరిగిన పరీక్షలకు 32,155 మంది విద్యార్థులకు గాను, 31,120 మంది హాజరు కాగా 1,035 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి వెల్లడించారు. 29 పరీక్షా కేంద్రాలను ఆర్ఐవో, డీవీఈవో, హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయన్నారు. తుగ్గలి ఏపీ జేసీలో 12, ఆస్పరి జీజేసీలో 5, ఆలూరు మోడల్ స్కూల్‌లో 3, మద్దికెర మోడల్ స్కూల్ కేంద్రంలో ఒకరు చొప్పున మొత్తం 21 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడటంతో స్క్వాడ్ బృందాలు డిబార్ చేశాయన్నారు.

శనగ రైతుకు మద్దతు

జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు

- ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 100 క్వింటాళ్ల కొనుగోలు
- ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా చర్యలు
- నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ
- మార్కెట్‌లో లభిస్తున్న ధర సుమారు రూ.4,600
- ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.5,335

ఈ–క్రాప్‌లో నమోదు చేసుకుని ఈ–కేవైసీతో పంట ధ్రువీకరించుకున్న రైతులు మాత్రమే మద్దతు ధరతో పంటను అమ్ముకునేందుకు అర్హులు. శనగ సాగు చేసిన ఆర్‌బీకేలను మార్క్‌ఫెడ్ మ్యాపింగ్ చేసింది. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాయి. శనగలను 50 కిలోల ప్రకారం తూకం వేస్తారు. సంచి బరువుకు ఒక కిలో అదనంగా తీసుకుంటారు.



కల్లూరు మండలం లక్ష్మీపురం కొనుగోలు కేంద్రంలో శనగలు విక్రయిస్తున్న రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): శనగ రైతుకు ప్రభుత్వం 'మద్దతు'గా నిలుస్తోంది. దళారీల బారిన పడి మోసపోకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనుగోళ్లను ముమ్మరం చేసింది. శనగలకు మద్దతు ధర రూ.5335లుగా ఉంది. అయితే మార్కెట్‌లో గరిష్టంగా రూ.4,600 మాత్రమే లభిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో మార్క్‌ఫెడ్ మద్దతు ధరతో శనగ కొనుగోళ్లు చేపట్టి రైతులకు భరోసా కల్పిస్తోంది. కర్నూలు జిల్లాలో 7వేల మంది రైతులు శనగ పంటను మద్దతు ధరతో అమ్ముకోవడానికి సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. నంద్యాల జిల్లాలో దాదాపు 5,800 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా రిజిస్ట్రేషన్‌లు చురుగ్గా సాగుతున్నాయి. కర్నూలు జిల్లాలో మద్దతు ధరతో కొనుగోలు చేసిన శనగను ఆదోనిలోని సీడబ్ల్యూసీ గోదాములకు, నంద్యాల జిల్లాకు సంబంధించి నంద్యాల, నందికొట్కూరులోని సీడబ్ల్యూసీ గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.

39వేల టన్నుల కొనుగోలు లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మద్దతు ధరతో 39వేల టన్నులు కొనుగోలు చేసేలా ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు లక్ష్యాన్ని ఇచ్చింది. నంద్యాల జిల్లాలో 25వేల టన్నులు, కర్నూలు జిల్లాలో 14వేల టన్నుల శనగలను మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నారు. ఈ లక్ష్యం మేరకు కొనుగోళ్లు పూర్తి చేస్తే అదనపు కొనుగోళ్లకు అనుమతి లభిస్తుంది. 10 రోజులుగా కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 8,064 క్వింటాళ్లు.. నంద్యాల జిల్లాలో 5,650 క్వింటాళ్లు కొనుగోలు చేయడం విశేషం. రెండు జిల్లాల్లో శనగల కొనుగోలుకు అవసరమైన మేర గోనెసంచులను మార్క్‌ఫెడ్ సిద్ధం చేసింది.

జాప్యం లేకుండా నగదు జమ

మద్దతు ధరతో కొనుగోలు చేసిన శనగలను గోదాముకు చేరిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుంది. డీబీటీ ద్వారా మొత్తంగా 10 రోజుల వ్యవధిలో నగదు బదిలీ చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లాలో 1,400 టన్నులకు పేమెంటు చేసేలా మార్క్‌ఫెడ్ అధికారులు నాఫెడ్‌కు పంపారు. దాదాపు 800 మంది రైతులకు ఒకటి, రెండు రోజుల్లో నగదు జమ అయ్యే అవకాశం ఉంది. నంద్యాల జిల్లాలో 400 మంది రైతులకు రూ.2.50 కోట్ల చెల్లింపులు జరిగినట్లు స్పష్టమవుతోంది.

వీటి పరిశీలనతోనే నాణ్యత నిర్ధారణ

- ఇతర వ్యర్థ పదార్థాలు 1 శాతం
- ఇతర పప్పు గింజలు 3 శాతం

కర్నూలు జిల్లా		నంద్యాల జిల్లా
1,00,683 ఎకరాలు	రబీలో శనగ సాగు	1,11,024 ఎకరాలు
27,595	ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు	35,636

(ఉమ్మడి జిల్లాలో శనగ దిగుబడి: 1,44,737 టన్నులు)



కొనుగోలు కేంద్రంలో శనగలను జల్లెడ పడుతున్న దృశ్యం

- దెబ్బతిన్న పప్పుదినుసు గింజలు 3 శాతం
- కొద్దిగా దెబ్బతిన్న, రంగులేని పప్పు దినుసుల గింజలు 4 శాతం
- పక్వానికి రాని, ముడత, కుచించుకపోయిన పప్పు దినుసుల గింజలు 6 శాతం
- ఇతర శనగ పంట రకాల గింజలు 2 శాతం
- పురుగుపట్టిన పప్పు దినుసుల గింజలు 4 శాతం
- తేమ 14 శాతం వరకు..

నాణ్యత తప్పనిసరి



శనగ రైతులు దళారీల బారిన పడి నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 33 కొనుగోలు కేంద్రాలకు 350 ఆర్‌బీకేలను మ్యాపింగ్ చేశాం. నాణ్యతతో పంటను తెస్తే ప్రతి రైతుకు మద్దతు ధర లభిస్తుంది. ఒక్కో రైతు నుంచి రోజుకు 25 క్వింటాళ్ల ప్రకారం గరిష్టంగా 100 క్వింటాళ్లు కొంటాం. ఇప్పటి వరకు దాదాపు 2వేల టన్నులు కొనుగోలు చేశాం. శనగలు గోదాముకు చేరిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుంది. లారీ లోడింగ్ అయ్యే వరకు హమాలీ చార్జీలు రైతులు భరించాలి.

– జి.రాజు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, కర్నూలు

మద్దతు ధరతో 42 క్వింటాళ్లు అమ్ముకున్నా



రబీలో 7 ఎకరాల్లో శనగ సాగు చేసినాం. ఎకరాకు 6 క్వింటాళ్ల ప్రకారం దిగుబడి వచ్చింది. దళారీలు క్వింటా శనగలను కేవలం రూ.4,500 ప్రకారం అడిగారు. ప్రభుత్వం సకాలంలో శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రూ.5,335 మద్దతు ధరతో 42 క్వింటాళ్లు అమ్ముకున్నా. కష్టానికి ఫలితం దక్కింది.

– దాసర చంద్రయ్య, మార్కాపురం గ్రామం, కల్లూరు మండలం

సంతోషంగా ఉంది



రబీలో 10 ఎకరాల్లో శనగ పంట సాగు చేసినాం. దళారీలు క్వింటా రూ.4,600 ప్రకారం కొంటామన్నారు. ప్రభుత్వం రూ.5,335 మద్దతు ధర ప్రకటించింది. మార్క్‌ఫెడ్ అధికారులు శనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో 60 క్వింటాళ్లు విక్రయించాం. దళారీలకు అమ్మింటే రూ.42వేలు నష్టపోయేవాన్ని.

– ఆర్.చింతారెడ్డి, చిన్నకొట్టాల, కల్లూరు మండలం



పిడకల సమరంలో పాల్గొన్న కైరుప్పల గ్రామస్తులు

కైరుప్పలలో వీరభద్రస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఎగిసిన పిడకలు గెలిచిన ప్రేమికులు

- కైరుప్పలలో కొనసాగిన ఆచారం
- 40 మందికి స్వల్ప గాయాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

ఆస్పరి: ప్రేమను అంగీకరించని తల్లిదండ్రులను చూసుంటాం.. ప్రేమికులను వేరుచేసే పెద్దల వ్యూహాలనూ గమనించి ఉంటాం.. ప్రేమను గెలిపించే పోరాటం మాత్రం మనకు అరుదుగా కనిపిస్తూ ఉంటుంది. అలాంటి సమరమే ఒకటి సంప్రదాయంగా గురువారం ఆస్పరి మండలం కైరుప్పలలో కొనసాగింది. ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవిని ఒక్కటి చేసింది. ఈ సంప్రదాయ సంగ్రామంలో 40 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఆచారం ప్రకారం కారుమంచి నుంచి పెద్దరెడ్డి వంశస్తుడైన నందకిషోర్‌రెడ్డి గుర్రంపై మందీ మార్బలంతో ఊరేగింపుగా కైరుప్పలకు వచ్చి వీరభద్రస్వామి ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి వెనుతిరిగారు. ఆతరువాత పిడకల సమరం మొదలైయింది. రెండు వర్గాలుగా విడిపోయిన గ్రామస్తులు పరస్పరం ఒకరిపై ఒకరు పిడికలతో దాడి చేసుకున్నారు. ఈ సమరాన్ని జనం ఆసక్తిగా చూశారు. కేకలు, ఈలలతో హోరెత్తించారు. అరగంట తర్వాత పోరు ముగిసింది. గ్రామ పెద్దలు ప్రేమికులైన వీరభద్రస్వామి, కాళికాదేవిలకు వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

25లోగా విద్యా దీవెనకు వివరాలు అప్‌డేట్ చేసుకోండి

కర్నూలు(అర్బన్): జగనన్న విద్యా దీవెన కింద నిధులు విడుదల కాని విద్యార్థులు తమ వివరాలను ఈ నెల 25వ తేదీలోగా తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ విద్యార్థులకు గతంలో తల్లుల ఖాతాల్లో నిధులు జమ అయ్యేవన్నారు. ప్రస్తుతం విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇంకా జిల్లాలో 2,532 మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాకు ఆధార్, ఎన్‌పీసీఐ అనుసంధానం కాకపోవడం వల్ల విద్యా దీవెన విడుదల కాలేదన్నారు. కాగా ఈ నెల 19 నాటికి 1,034 మంది తమ వివరాలను అప్‌డేట్ చేసుకున్నారని, ఇంకా 1,498 మంది విద్యార్థులు తమ బ్యాంకు వివరాలను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయలేదన్నారు. వీరందరూ ఈ నెల 25వ తేదీలోగా పోస్టాఫీసుల్లో అకౌంట్ ఓపెన్ చేసి తమ పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టల్ ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఎన్‌పీసీఐ మ్యాప్ అయిన విద్యార్థులకు త్వరలో విద్యా దీవెన నిధులు విడుదలవుతాయని ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక నెలవు



కర్నూలు నగరంలో కనిపించిన నెలవంక

- నెల వంక దర్శనంతో ప్రారంభమైన రంజాన్
- నెల రోజులపాటు దైవచింతనలో గడపనున్న ముస్లింలు
- ఉపవాసాలకు ఏర్పాట్లు

కర్నూలు (రాజ్‌విహార్): నెల వంక కనిపించింది.. రంజాన్ మాసం ప్రారంభమైంది. ముస్లింలు చిరునవ్వుతో ఒకరి నొకరు ఆలింగనం చేసుకుంటూ 'చాంద్ దిఖ్ గయా' అంటూ ముబారక్ చెప్పుకున్నారు. గురువారం సాయంత్రం అవుట్ పేలడంతో ధ్రువీకరణ చేసుకొని.. హడావుడిగా వెళ్లి ఉపవాసాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. రాత్రి మొదటి తరావీహ్ నమాజు చేసుకున్నారు. నెల రోజుల పాటు ఆధ్యాత్మికంగా గడిపేందుకు సంసిద్ధమయ్యారు. శుక్రవారం తొలి రోజాతో తమ ఉపవాస దీక్షలను ప్రారంభించనున్నారు.

ధ్రువీకరించిన హిలాల్ కమిటీ

గురువారం కర్నూలు ఖాజీ సలీం సాహెబ్ నేతృత్వంలో హిలాల్ కమిటీ సమావేశమైంది. గురువారం సాయంత్రం నెలవంక దర్శనం అయ్యిందని, శుక్రవారం నుంచి తొలి రోజా ప్రారంభమవుతుందని ఈ కమిటీ ధ్రువీకరించింది.

నెల రోజులు ఆధ్యాత్మిక చింతన

రంజాన్ నెల ఎంతో పవిత్రమైనది. ముస్లింలు ఉపవాసాలు ఉండడంతో పాటు రోజుకు ఐదు పూటలా నమాజు చదువుతారు. ప్రతి ముస్లిం విధిగా (ఫరజ్) ఉపవాస దీక్ష పాటించాలని నియమం. దీంతో పాటే ఈనెలలో రోజా ఖురాన్‌ను పఠించాలి, శ్రద్ధగా వినాలి. ఈ పవిత్ర మాసంలోనే దివ్య గ్రంథమైన ఖురాన్, మరిన్ని దైవ గ్రంథాలూ ఆవిర్భవించాయని మతపెద్దలు తెలిపారు. రంజాన్ మాసంలో ప్రత్యేక తరావీహ్ నమాజు, ఇతర నఫీల్ నమాజ్‌లు చేసుకుంటారు. దువాతో అల్లాకు తమ సమస్యలు చెప్పుకొని వాటిని పరిష్కరించాలని వేడుకుంటారు.

శుక్రవారంతో మొదలు.. శుక్రవారంతో ముగింపు

ఈ రంజాన్ మాసంలో శుక్రవారానికి ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. సాధారణంగా శుక్రవారం అంటే ముస్లింలు చిన్న పండుగలా భావిస్తారు. అలాంటిది ఈ ఏడాది రంజాన్ శుక్రవారమే ప్రారంభమైంది. ఈ నెలలో ఐదు శుక్రవారాలు వస్తుండగా చివరి రోజా (జుమ్మతుల్ విదా) కూడా శుక్రవారమే రానుంది.

ఉచిత సహెర్‌కు ఏర్పాట్లు

రంజాన్ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సహెర్ ఏర్పాట్లు చేశారు. రోజా ఉండే వారికి ఉచితంగా భోజనాలు వడ్డించేందుకు ముందుకు వచ్చారు. కర్నూలు నగరంలో లాల్ మసీదు వద్ద ఉన్న ఖూబ్ సూరత్, పెద్దమార్కెట్ వద్ద ఉన్న నూరానీ, కొత్తపేటలో ఉన్న హజరత్ మౌలా మిష్కిన్ , కొత్తపేటలోని ఖాదుమియా, సి.క్యాంప్ సెంటర్‌లోని మామూర్, అబ్బాస్ నగర్ యూనిక్ స్కూల్ వద్ద ఉన్న అబ్బాస్ మసీద్‌లో సహెరీ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గౌసల్ ఆజం మసీదులో కేవలం విద్యార్థుల కోసం సహెర్ ఏర్పాట్లు చేశారు.

ఈరన్నస్వామికి రూ.1.04 లక్షల విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో చేపడుతున్న శాశ్వత నిత్య అన్నదానానికి గురువారం ఎమ్మిగనూరుకు చెందిన ప్రతాప్ కమలాకర్, దీప్తి దంపతులు రూ.94,000, అలాగే శాశ్వత పూజలకు రూ.5,000, గోశాలకు రూ.5,000 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

గార్దబాలతో ప్రదక్షిణ





ఉగాది ఉత్సవాల్లో భాగంగా గురువారం కల్లూరు చౌడేశ్వరి దేవాలయం చుట్టూ బురదలో రజకులు గార్దబాలతో ప్రదక్షిణలు చేశారు. ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుక నిర్వహించారు. అంతకు ముందు గార్దబాల మీద ప్రదర్శనగా ఆలయానికి వచ్చారు. చౌడేశ్వరి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాన్ని తిలకించేందుకు కర్నూలు నగరవాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలు వీరే..



షోరూంలో లక్కీ డ్రా విజేతను ప్రకటిస్తున్న డీఎస్పీ మహేష్, చిత్రంలో సోనోవిజన్ ప్రతినిధులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని అమ్మ హాస్పిటల్ ఎదురుగా ఉన్న సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో గురువారం లక్కీడ్రా తీశారు. కొనుగోలుదారుల సమక్షంలోనే విజేతల వివరాలను కర్నూలు టౌన్ డీఎస్పీ మహేష్ ప్రకటించారు. కర్నూలు గణేశ్‌నగర్‌కు చెందిన ధర్మారెడ్డి మారుతీకారును, కర్నూలు చెందిన షేక్ అర్షద్‌అలీ ఎల్‌ఈడీ టీవీని, కప్పల్‌నగర్‌కు చెందిన షేక్షావలి రిఫ్రిజిరేటర్‌ను, పెద్దపాడుకు చెందిన వినోద్‌కుమార్ వాషింగ్ మిషన్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి మాట్లాడుతూ.. ఉగాది పండుగను పురస్కరించుకొని సోనో విజన్ కొనుగోలుదారులకు లక్కీడ్రా నిర్వహించామన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై ప్రజల్లో నమ్మకమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఉగాది డిస్కౌంట్ పేరుతో అదనంగా వడ్డీ లేకుండా డీబీడీ లేకుండా ఫైనాన్స్ సదుపాయంతో కొనుగోలుదారులకు ఉత్పత్తులు అందించామన్నారు. అమ్మకంతో పాటు సర్వీసు తమ ప్రత్యేకత అని తెలిపారు.

క్షయ కబళించకుండా..

- టీబీ రోగులకు అందుబాటులో వైద్యం
- జిల్లాలో ప్రస్తుతం 5,162 మంది బాధితులు
- దాతల సహాయంతో నిత్యావసరాల పంపిణీ
- నేడు వరల్డ్ టీబీ డే

కర్నూలు(హాస్పిటల్): క్షయ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయి. ఎంత ఖర్చుకైనా వెనుకాడటం లేదు. మొండి వ్యాధిని పారదోలేందుకు ఒక్కో వ్యక్తికి రూ.18 లక్షలు ఖర్చు చేస్తున్న ఉదంతాలు ఉన్నాయి. 2025 నాటికి సమాజం నుంచి క్షయను పారదోలాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఈ నెల 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి దినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్‌ను జిల్లాలో 2003 మార్చిలో ప్రారంభించారు. అప్పటి నుంచి జిల్లాలో ప్రతి 2 లక్షల నుంచి 2.5లక్షల జనాభాకు ఒక టీబీ యూనిట్ చొప్పున 9 యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇందులో ఒక సీనియర్ టీబీ సూపర్‌వైజర్, ఒక సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను పర్యవేక్షించేందుకు గాను ప్రతి టీబీ సూపర్‌వైజర్‌కు ఒక మోటార్ సైకిల్‌ను అందజేశారు. క్షయ వ్యాధి కేసులను గుర్తించేందుకు ప్రతి సీహెచ్‌సీలోనూ ఎక్స్‌రే యూనిట్లను ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు అందించేందుకు నాలుగు నెలల మందుల స్టాక్‌ను సిద్ధంగా ఉంచుతున్నారు. దీంతో పాటు పట్టణ ప్రాంతాలైన కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో 8 మంది టీబీ హెల్త్ విజిటర్లు పనిచేస్తున్నారు. క్షయ వ్యాధిని నిర్ధారించేందుకు గాను జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీలలో రెండు సీబీ నాట్ మిషన్లు, 15 ట్రూనాట్ మిషన్లు ఏర్పాటు చేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రాన్ని మైక్రోస్కోప్ సెంటర్‌గా మార్చి టీబీ లక్షణాలున్న వ్యక్తి నుంచి గళ్లను సేకరించి ఇక్కడ పరీక్ష చేస్తున్నారు. ఆ గళ్లలో టీబీ క్రిములుంటే సదరు వ్యక్తికి డాట్ ప్రొవైడర్ ద్వారా మందులు ఇస్తూ క్షయ చికిత్సను 6 నుంచి 8 నెలల పాటు అందిస్తున్నారు.

జిల్లాలో 5,162 మందికి క్షయ

జిల్లాలో గత సంవత్సరంలో 42,297 మందికి గళ్ల పరీక్ష చేయగా అందులో 5,162 మందికి క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వీరికి వెంటనే డాట్ ప్రొవైడర్ ద్వారా మందులు ఇస్తూ చికిత్స ఇవ్వగా 91 శాతం మందికి నయమైంది. క్షయకు గురైన వారిలో 156 మంది హెచ్‌ఐవీ పాజిటివ్ వ్యక్తులు కూడా ఉన్నారు. వీరికి క్షయ మందులతో పాటు ఏఆర్‌టీ చికిత్సను కొనసాగించారు.



ఇవీ లక్షణాలు

రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నా, దగ్గితే గళ్ల పడటం, బరువు తగ్గడం, ఆకలి తగ్గిపోవడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే క్షయగా అనుమానించి వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలి. ఈ మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా గళ్ల పరీక్ష, ఎక్స్‌రే తీస్తున్నారు. ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో సీబీనాట్, ఆర్‌టీ పీసీఆర్ పరీక్ష నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వారికి డాట్ ప్రొవైడర్ల ద్వారా 6 నుంచి 8 నెలల పాటు మందులు అందజేస్తున్నారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యులు సూచించిన విధంగా నిర్ణీత సమయం మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. రూ.2 లక్షల నుంచి రూ.18 లక్షల విలువ జేసే ఈ మందులను సైతం ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మందులతో పాటు రోగి పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.50 చొప్పున అందజేస్తున్నారు. దీంతో పాటు క్షయ వ్యాధిగ్రస్తునికి మందులు మింగించిన పర్యవేక్షకులకు(డాట్ ప్రొవైడర్)లకు రూ.1000 నుంచి రూ.5000 పారితోషికం ఇస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించిన వైద్యులకు కేసుకురూ.500 చొప్పున అందజేస్తున్నారు.

రూ.18 లక్షల మందులు ఉచితం

సాధారణ క్షయ వ్యాధి మందులకు లొంగని వ్యాధిగ్రస్తున్ని మల్టీడ్రగ్ రెసిస్టెంట్(ఎండిఆర్) టీబీ వ్యక్తిగా నిర్ధారిస్తారు. వీరికి రెండేళ్ల పాటు ప్రత్యేకమైన మందులతో చికిత్స అందిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.2లక్షల దాకా ఖర్చు అవుతోంది. అయితే ఎండీఆర్‌లో కూడా కొంతమందికి ఈ మందులు కూడా పనిచేయవు. ఇలాంటి వారికి బెడాక్విలైన్, డెలామనిడ్ మందులను ఇస్తున్నారు. ఈ మందులను రెండేళ్ల కోర్సులో ఆరు నెలల పాటు ఇస్తారు. ఈ వ్యక్తికి అయ్యే ఖర్చు మొత్తం రూ.18 లక్షలు ఉంటోంది. జిల్లాలో గత మూడేళ్లలో ఇలాంటి వ్యాధి ఉన్న 137 మందికి చికిత్స అందించారు. ప్రస్తుతం 54 మంది బెడాక్విలైన్, 8 డెలామనిడ్ రోగులకు చికిత్స కొనసాగిస్తున్నారు.

కర్నూలు, ఆదోనిలలో సీబీ నాట్ మిషన్లు

క్షయ వ్యాధిని కచ్చితంగా నిర్ధారణ చేసే సీబీ నాట్ మిషన్లు 2016లో కర్నూలు మెడికల్ కాలేజీతో పాటు ఇటీవల ఆదోని ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటు చేశారు. ఈ మిషన్ హెచ్‌ఐవీ రోగుల్లో, ఊపిరితిత్తుల వ్యాధులున్న వారిలో, చిన్నపిల్లల్లో క్షయ, ఎండీఆర్ టీబీని గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. కర్నూలు మెడికల్ కాలేజీతో పాటు విశ్వభారతి మెడికల్ కాలేజీలకు మూడు ఫ్లోరోసెంట్ మైక్రోస్కోప్‌లను ఇంటర్నేషనల్ యూనియన్ అగైన్స్ట్ లంగ్ డిసీజెస్ అండ్ ట్యూబర్‌క్లోసిస్ సరఫరా చేశారు. ఎండీఆర్ క్షయ కేసులకు చికిత్స చేసేందుకు గాను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

సరుకుల పంపిణీ..

నిక్షయ్ మిత్ర ద్వారా కో ఆపరేటివ్, కార్పొరేట్, ప్రజాప్రతినిధులు, వ్యక్తిగతంగా, పలు రకాల సంస్థలు, ఎన్‌జీవోలు, రాజకీయపార్టీల ద్వారా క్షయ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 61 సంస్థలు రిజిస్టర్ కాగా వారిలో 135 మంది క్షయ రోగులను దత్తత తీసుకుని పోషకాహారాన్ని అందజేస్తున్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



ఇప్పటికీ కొంత మందిలో క్షయపై అపనమ్మకాలు ఉన్నాయి. టీబీ నయం చేయలేనిదని, చికిత్సకు ఉపయోగించే మందులు రోగికి హాని చేస్తాయని, ఈ మందులు నపుంశకత్వం, వంధత్వానికి కారణం అవుతుందని అనుమానాలున్నాయి. ఇవన్నీ మూఢనమ్మకాలే. క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ పూర్తిగా తగ్గిపోతుంది. – డాక్టర్ పొట్టి వెంకట చలమయ్య, పల్మనాలజిస్టు, కర్నూలు



క్షయ వ్యాధి అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ భాస్కర్, సిబ్బంది

నేడు ర్యాలీ, అవగాహన సదస్సు

క్షయ వ్యాధి దినాన్ని పురస్కరించుకుని కర్నూలులో శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ చెప్పారు. గురువారం జిల్లా క్షయ నివారణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24వ తేదీ ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ నుంచి మెడికల్‌కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కళాశాలలోని నూతన లెక్చరర్ గ్యాలరీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 17న పీజీ వైద్య విద్యార్థులకు క్విజ్, 16, 17వ తేదీల్లో హౌస్‌సర్జన్లు, నర్సింగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. 24వ తేదీన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని, అదే రోజు నిక్షయ దివస్‌లో భాగంగా మెడికల్ కాలేజీల్లో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు(సీఎంఈ) నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోలీసుల పట్ల దురుసు ప్రవర్తన.. ఇద్దరిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్: విధులకు ఆటంకం కలిగించటమే కాకుండా, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సోమప్పనగర్‌కు చెందిన కమ్మరి మల్లికార్జున అతిగా మద్యం తాగి బుధవారం అర్ధరాత్రి శివ సర్కిల్‌లో ఆటో డ్రైవర్లతో గొడవపడతున్నాడు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు గొడవను నివారించటానికి వెళ్లటంతో అసభ్య పదజాలంతో తిడుతూ భౌతికంగా దాడికి దిగారు. దీంతో మల్లికార్జునను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అతని చెల్లెలు కమ్మరి పద్మ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆవేశంతో కానిస్టేబుళ్ల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో అన్నా చెల్లెలుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్త్రీనిధి రుణాలతో జీవనోపాధుల వృద్ధి

- డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య

కర్నూలు(అగ్రికల్చర్): స్త్రీ నిధి ద్వారా అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ రుణాలు పంపిణీ చేసి జీవనోపాధులను మరింత మెరుగుపరచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ- వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. 2022-23లో స్త్రీనిధి ద్వారా రూ.100 కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు రూ.93 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. గురువారం విజయవాడలో స్త్రీ నిధి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ మోడ్‌లో టీటీడీసీ నుంచి పీడీతో పాటు స్త్రీ నిధి ప్రతినిధులు తదితరులు తిలకించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... ప్రతి పొదుపు మహిళ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అర్హులైన పొదుపు మహిళలందరికీ స్త్రీ నిధి నుంచి రుణాలను దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే మంజూరు చేస్తున్నామని చెప్పారు. 2023-23లో స్త్రీ నిధి కింద రూ.115 కోట్లు పంపిణీ చేయాలనేది లక్ష్యమని, రుణాలు ఎవరెవరికి అవసరమో ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి డైరెక్టర్లు విజయలక్ష్మి, కవిత, డీఆర్‌డీఏ-వైకేపీ అదనపు పీడీ శ్రీధర్‌రావు, వైఎస్‌ఆర్ బీమా డీపీఎం రహిమాన్, స్త్రీనిధి ఏజీఎం దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించండి

- వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి

కర్నూలు (సెంట్రల్): సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలను గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మన బడి నాడు- నేడు కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న గోరు ముద్ద పథకాన్ని పటిష్టంగా అమలుపరచాలన్నారు. జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి దర్శనానికి 40వ సారి

మహానంది: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా కనగాపూర్ దిగంబర్ మఠం పీఠాధిపతి కంబళగిరి మహారాజ్ స్వామి వరుసగా 40 ఏళ్లుగా మహానందీశ్వర స్వామిని దర్శించుకుంటున్నారు. గత 39 ఏళ్ల పాటు నిర్విరామంగా వచ్చిన మహారాజ్ స్వామి గురువారం తన శిష్యబృందంతో 40వ సారి మహానందికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. స్థానిక యాగశాలలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. లోకంలో అందరూ బాగుండాలని ప్రతి ఏడాది మహానందీశ్వరస్వామిని దర్శించుకుంటున్నట్లు మహారాజ్ స్వామి తెలిపారు.



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న కంబళగిరి మహారాజ్ స్వామి

సరికొత్త ప్యాకింగ్‌లో విజయ ఉత్పత్తులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు మిల్క్ యూనియన్ విజయ పాలు, పాల ఉత్పత్తులను మరింత నాణ్యత, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో వినియోగదారులకు సరఫరా చేస్తుందని విజయ డెయిరీ చైర్మన్ ఎస్‌వి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం కర్నూలు విజయ డెయిరీలో జరిగిన కార్యక్రమంలో కొత్త ప్యాకింగ్‌తో పాలు, పాల పదార్థాలను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విజయ గోల్డ్, విజయ టోన్డ్, విజయ స్పెషల్, నెయ్యి, పన్నీరు, మజ్జిగను కొత్త ప్యాకింగ్‌లో మారింత నాణ్యతతో సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు. వేసవిలో పాలు, మజ్జిగ, పెరుగుకు ఎలాంటి కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. నష్టాల్లోని విజయ డెయిరీని నూతన సంస్కరణల ద్వారా లాభాల్లోకి తీసుకొచ్చామని.. పాల ఉత్పత్తిదారులకు బోనస్ కూడా ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ ఓఎస్‌డీ ప్రదీప్ కుమార్, కర్నూలు డెయిరీ మేనేజర్ ఎస్.విజయకుమార్, మార్కెటింగ్ మేనేజర్ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



నూతన ప్యాకింగ్ ఉత్పత్తులను విడుదల చేస్తున్న చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి

ఏపీఎస్పీ బెటాలియన్‌లో డీఐజీ తనిఖీ



చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఐజీ వెంకటేశ్వర్లు

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌లో బెటాలియన్ మూడో రేంజ్ డీఐజీ సి.హెచ్.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఉదయం ఆయన బెటాలియన్‌కు చేరుకోగానే కమాండెంట్ రవిశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి పటాలం సిబ్బందిని పరేడ్ గ్రౌండ్‌లో సమావేశపరచి విధి నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని, అనవసరంగా ఎండలకు తిరుగుతూ ఇబ్బంది పడొద్దని సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాసరావు, రవికిరణ్, ఎస్.ఎం.బాషాతో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, పటాలం సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు

కోడుమూరు రూరల్: శ్రీవల్లెలాంబదేవి తిరుణాలను పురస్కరించుకుని గురువారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. పోటీలకు కర్నూలు జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి కూడా 30 వరకు పొట్టేళ్లు వచ్చాయి. ఈ పోటీల్లో గుంతకల్‌కు చెందిన రామాంజినేయులు పొట్టేలు విజేతగా నిలిచింది. రెండోస్థానాన్ని ముడుమలగుర్తి నాగరాజుకు చెందిన పొట్టేలు, మూడో స్థానాన్ని తిమ్మాపురం భైరవకు చెందిన పొట్టేలు కైవసం చేసుకుంది. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, శ్రీవల్లెలాంబదేవి ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు దాతల సహకారంతో నగదు బహుమతులను అందజేశారు.